సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం, 16, ఆగస్టు, 2025



అవసరం తీరాక అంతే..
నాడు పనిచేసిన కార్మికుల వారసులు నివసిస్తున్న 21పిట్ ఏరియాను ఖాళీ చేయించేందుకు సింగరేణి సిద్ధమవుతోంది. 8లో



ఉట్ల సందడికి వేళాయె..
నేడు ఉట్టి కొట్టి శ్రీకృష్ణాష్టమిని ఘనంగా జరుపుకోనున్నారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించనున్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
29° / 24°
జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచ ధారణలో రామయ్య



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

బంగారు ఆభరణం వితరణ

శ్రీ సీతారామ చంద్రస్వామివారికి భద్రాచలానికి చెందిన ముదునూరు బలరామకృష్ణంరాజు స్మార్థకార్థం ఆయన సతీమణి పద్మావతి రూ.1,90,000 విలువైన 21 గ్రాముల బంగారు ఆభరణం ఆలయానికి అందజేశారు. ఆలయ సిబ్బంది కత్తి శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం జరిపారు. పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలు చేశారు. కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు.

ఢిల్లీలో స్వాతంత్య్ర వేడుకలకు గౌతంపూర్ కార్యదర్శి



ఢిల్లీలో స్వాతంత్య్ర వేడుకలకు హాజరైన కార్యదర్శి షర్మిల

చుంచుపల్లి: ఢిల్లీలోని ఎర్రకోటలో శుక్రవారం జరిగిన స్వాతంత్య్ర వేడుకలకు చుంచుపల్లి మండలం గౌతంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి జక్కంపూడి షర్మిల హాజరయ్యారు. 2023లో ఆరోగ్య పంచాయతీ విభాగంలో గౌతంపూర్ గ్రామ పంచాయతీకి జాతీయ అవార్డు లభించింది. ఈ నేపథ్యంలో ఆమెను వేడుకలకు ఆహ్వానించి ప్రత్యేక మెమెంటోను బహూకరించారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఉమ్మడి జిల్లాకు 2,638 మెట్రిక్ టన్నుల యూరియా



యూరియా కేటాయింపులు పరిశీలిస్తున్న ఏఓ

చింతకాని: ఆర్ఎఫ్‌సీఎల్ కంపెనీ నుంచి జిల్లాకు 2,638.44 టన్నుల యూరియా సరఫరా అయింది. చింతకాని మండలం పందిళ్లపల్లి రేక్ పాయింట్‌కు శుక్రవారం చేరిన యూరియాను ఏఓ(టెక్నికల్) పవన్‌కుమార్ పరిశీలించి జిల్లాల వారీగా కేటాయించారు. ఖమ్మం జిల్లాకు 1,538.44 మెట్రిక్ టన్నులు, భద్రాద్రి జిల్లాకు వెయ్యి టన్నులు కేటాయించగా వంద మెట్రిక్ టన్నుల యూరియాకు బఫర్ స్టాక్‌గా నిల్వ చేసినట్లు ఏఓ తెలిపారు. జిల్లాకు సరిపడా యూరియా చేరినందున రైతులెవరూ ఆందోళన చెందొద్దని సూచించారు.

అన్నింటా ప్రగతి





జాతీయ జెండా ఎగురవేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న తుమ్మల

కొబ్బరి పరిశోధనా కేంద్రం, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు ప్రతిపాదనలు

- నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కొత్త సబ్‌స్టేషన్లు, లైన్లు
- ఆరోగ్యశ్రీ పథకంలో రూ. 7.97 కోట్ల విలువైన వైద్య సేవలు
- స్వాతంత్య్ర వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

సూపర్‌బజార్(కొత్తగూడెం): అన్ని రంగాల్లో జిల్లా ప్రగతిపథంలో పయనిస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అభివృద్ధిలో అగ్రగామి దిశగా దూసుకుపోతోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ప్రగతి మైదానంలో 79వ స్వాతంత్య్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి తుమ్మల మొదట జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పతాకవందనం అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఓపెన్ టాప్ జీపులో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజులతో కలిసి ప్రగతి మైదానంలో తిరుగుతూ ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరినప్పుడే నిజమైన స్వాతంత్య్రం సిద్ధించినట్లని వ్యాఖ్యానించారు. జిల్లా పారిశ్రామికంగా మాంచెస్టర్ ఆఫ్ తెలంగాణగా, ఎకో టూరిజానికి కేరాఫ్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు.

గోదావరి నదిపై ప్రయాణాలు..

గోదావరి నదిపై ప్రయాణాలు జరిగేలా వాటర్‌వేస్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, సింగరేణి విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నామని వివరించారు. భద్రాచలంలో గోదావరి వరదలకు అడ్డుకట్టగా కరకట్ట విస్తరణ పనులు సాగుతున్నాయని తెలిపారు. పాండురంగాపురం నుంచి మల్కాన్‌గిరి వరకు, కొత్తగూడెం నుంచి కిరండోల్ రైల్వే కనెక్టివిటీ భద్రాచలం రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. అశ్వారావుపేటలో కొబ్బరి పరిశోధనా కేంద్రం, కొత్తగూడెంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునికీకరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి రూ.93 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఆయిల్‌పామ్, కోకో సాగుకు హబ్..

జిల్లాలో రూ 318.69 కోట్ల రైతు భరోసా, మృతి చెందిన 698 మంది రైతు కుటుంబాలకు రూ.34.90 కోట్ల పరిహారం అందించినట్లు తెలిపారు. ఆయిల్‌పామ్, కోకో సాగులో తెలంగాణకు జిల్లా హబ్‌గా మారిందన్నారు. సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందిస్తున్నామని, ఆరు వ్యవసాయ మార్కెట్ల పరిధిలో 34 వేల 650 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 19 గోదాములు నిర్మించామని తెలిపారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు 21 ఉన్నాయని, 9వేల 181 మెట్రిక్ టన్నుల ఎరువులు, 3,168 కిలోల విత్తనాలను పంపిణీ చేసినట్లు వివరించారు. జిల్లాలో 2 లక్షల 76 వేల 57 ఆహార భద్రత కార్డులు, 21 వేల 129 అంత్యోదయ కార్డుల ద్వారా 9లక్షల 3వేల 66 మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కొత్త సబ్‌స్టేషన్లు, 33 కేవీ లైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.39.80 కోట్లతో పంచాయతీ భవనాలు..

జిల్లాలో 199 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను రూ.39.80 కోట్లతో ప్రారంభించామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంలో రూ. 7.97 కోట్ల వైద్య సేవలు 3,241 మందికి అందజేసినట్లు వివరించారు. రూ.130 కోట్లతో ప్రభుత్వ వైద్యశాలల పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. పౌష్టికాహార పథకంలో 30 వేల మంది చిన్నారులకు బాలామృతం కింద నెలలో 16 రోజులు గుడ్లు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

1,15,204 మందికి ఆసరా పెన్షన్

భూభారతి చట్టం కింద 78,278 దరఖాస్తులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉపాధిహామీ పథకంలో ఇప్పటి వరకు 23 లక్షల 25వేల పనిదినాలు కల్పించామని, రూ. 63.17 కోట్లు కూలీలకు చెల్లించామని వివరించారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. టీజీ ఐపాస్ ద్వారా 23 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని, టీ ఐడియా రాయితీ పథకంలో 38 యూనిట్లకు రూ 1.47 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. జిల్లాలో 1,15,204 మందికి ప్రతినెలా రూ.25.97 కోట్ల ఆసరా పెన్షన్ చెల్లిస్తున్నామని తెలిపారు. స్త్రీనిధి రుణాలు రూ. 25.22 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మహిళలకు సూక్ష్మ రుణ వ్యాపారాల కింద 448 యూనిట్లకు రూ 9.43 ట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు మంజూరు చేస్తామని అన్నారు. అర్హులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందిస్తున్నట్లు తెలిపారు.



కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ



కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్, క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అదనపు కలెక్టర్లు డి వేణుగోపాల్, విద్యాచందన, అధికారులు పాల్గొన్నారు.

సీఎం చేతుల మీదుగా జిల్లావాసికి అవార్డు



ఏసీపీ మోహన్‌కుమార్‌కు మెడల్‌ను అందజేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

దమ్మపేట: మండలంలోని పట్వారిగూడెం గ్రామానికి చెందిన, ఏసీపీ మోహన్‌కుమార్ హైదరాబాద్‌లోని గోల్కొండలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో ఇండియన్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీసెస్ అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. మోహన్‌కుమార్ హైదరాబాద్‌లోని సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో విశిష్ట సేవలకు గత రిపబ్లిక్ డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మెరిటోరియస్ సర్వీసెస్ అవార్డును ప్రకటించింది. ఆ అవార్డును స్వాతంత్య్ర వేడుకల్లో సీఎం అందించిన అభినందించారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఆదివాసీ జాతికి అండగా ఉంటా

కుమురం భీం విగ్రహ ఆవిష్కరణలో మంత్రి ధనసరి సీతక్క

మణుగూరు టౌన్: ఆదివాసీ జాతికి అండగా ఉంటానని, అలాగని తాము ఎవరికీ వ్యతిరేకం కాదని రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శుక్రవారం మణుగూరు బీటీపీఎస్ వద్ద బీటీపీఎస్ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుమురం భీం విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మల దయతోనే తనకు మంత్రిగా పని చేసే అవకాశం లభించిందన్నారు. అర్హులకు సంక్షేమ ఫలాలు అందే విషయంలో లోపాలుంటే తెలపాలని, వాటిని సరిచేసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఆదివాసీలకు ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ కుమురం భీం విగ్రహాలను ఆవిష్కరిస్తామని చెప్పారు. పులుసుబొంత ప్రాజెక్ట్ నిర్మాణంపై సీఎం, ఇరిగేషన్ మంత్రిని కలుస్తానని తెలిపారు. మేడారం జాతరకు ఈసారి రూ.150 కోట్లు నిధులు కేటాయించి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏటూరునాగారం, ఉట్నూరు ఐటీడీఏలకు రూ.12.50 కోట్లతో నూతన భవనాలు నిర్మిస్తామని పేర్కొన్నారు.



కుమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు పాయం, తెల్లం తదితరులు

అయోధ్యకు నివాళి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు అయోధ్య కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు. రామానుజవరంలోని వారి నివాసంలో అయోధ్య చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జెడ్పీ మాజీ చైర్మన్ చందా లింగయ్య, ఆదివాసీ సంఘాలు, కాంగ్రెస్ రమణ, లక్ష్మయ్య, వట్టం ఉపేందర్, చందా సంతోష్, వట్టం నారాయణ, వాసం రామకృష్ణ, బట్టా విజయ్ గాంధీ, పి.నవీన్, శివసైదులు, సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, గొడిశాల రామనాథం, ఆవుల సర్వేశ్వరరావు, సౌజన్య, కేశవరావు, రహీంపాషా పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు

చంద్రుగొండ : మండలంలోని బెండాలపాడులో ఈ నెల 21న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన దాదాపు ఖరారైంది. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శుక్రవారం లబ్ధిదారులను కలిసి సూచించారు. 40 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఏర్పాట్లపై పోలీస్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. పోలీస్ అధికారులు సైతం బెండాలపాడు గ్రామాన్ని సందర్శించి సీఎం భద్రతపై సమీక్షించారు. అనంతరం దామరచర్లలో పది ఎకరాల్లో నిర్వహించతలపెట్టిన సభ ప్రాంగణాన్ని, చంద్రుగొండలో ఏర్పాటు చేయనున్న హెలీప్యాడ్, రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఓఎస్‌డీ నరేందర్, ఇంటెలిజెన్స్ డీఎస్పీ వెంకన్నబాబు, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, గృహనిర్మాణశాఖ పీడీ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



బెండాలపాడు గ్రామంలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారె, పోలీస్ అధికారులు

కిన్నెరసానిలో పర్యాటక సందడి

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో పంద్రాగస్టు సందర్భంగా పర్యాటకులు సందడి చేశారు. శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కిన్నెరసాని ప్రాజెక్టుకు సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 585 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.32,935 ఆదాయం లభించింది. 230 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.13,280 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కిన్నెరసానికి 1400 క్యూసెక్కుల వరద

ఎగువన కురుస్తున్న వర్షాలకు కిన్నెరసాని జలాశయంలోకి 1400 క్యూసెక్కుల వరద వస్తోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, శుక్రవారం 404.40 అడుగులకు చేరింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటు ఎత్తి ఉంచి 5 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

ప్రతీ గిరిజనుడికి సంక్షేమం

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: ఏజెన్సీ ప్రాంతంలో ప్రతీ గిరిజనుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేలా కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. శుక్రవారం స్వాతంత్య్ర వేడుకలను ఐటీడీఏలో ఘనంగా జరిపారు. జాతీయ జెండా ఎగురవేసి వందనం చేశారు. దేశ నాయకుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యా, వైద్యం, ఇంజనీరింగ్, వ్యవసాయం, మౌలిక వసతులు, సాగు, తాగునీరు, స్వయం ఉపాధి తదితర రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధిస్తున్నట్లు పేర్కొన్నారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న పీఓ రాహుల్

అనంతరం ఐటీడీఏ ప్రగతి నివేదికను సమర్పించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ భక్తి గీతాల నృత్యాలు అలరించాయి.

సరికొత్త నమూనా..

- శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన అభివృద్ధికి ప్రణాళిక
- ఇటీవల రామాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, ఆర్కిటెక్ట్
- బడ్జెట్‌కు తగినట్లుగా అభివృద్ధి పనుల ప్రతిపాదన
- మాస్టర్‌ప్లాన్‌లో 'సాక్షి' సూచనలకు చోటు



ఆలయ కొత్త నమూనా

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన అభివృద్ధికి సరికొత్త నమూనా రూపుదిద్దుకుంటోంది. తాజా ప్రణాళికలో ప్రధాన ఆలయానికి ఎలాంటి మార్పులూ చేయకుండా ఇతర అభివృద్ధి పనులనే ప్రతిపాదించారు. దీంతో పదకొండేళ్లుగా రామాలయ మాస్టర్ ప్లాన్‌పై కమ్ముకున్న మబ్బులు వీడినట్లయింది. వైదిక కమిటీ సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించాక చేర్పులు మార్పులతో ప్రణాళిక తుదిరూపు దాల్చనుంది. కాగా మూడు రోజుల క్రితం ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ రామాలయాన్ని సందర్శించి, మాస్టర్ ప్లాన్‌పై చర్చించిన విషయం విదితమే.

ప్రధాన ఆలయంలో మార్పులు లేకుండా..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత శ్రీరామ నవమికి వచ్చిన నాటి సీఎం కేసీఆర్ భద్రాచలం అభివృద్ధికి రూ.100 కోట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రముఖ ఆర్కిటెక్ట్ ఆనందసాయి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ప్రధాన ఆలయంతో సహా సమూల మార్పులను సూచిస్తూ ప్రణాళిక రూపొందించారు. అనంతర కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మాస్టర్‌ప్లాన్ నమూనాలకే పరిమితమైంది. దీంతో అప్పటి ప్రభుత్వం విమర్శల పాలైంది. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన రేవంత్ రెడ్డి భద్రాచలం ఆలయ అభివృద్ధికి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి మాఢ వీధుల విస్తరణకు రూ.60 కోట్లు ప్రకటించారు. ఇప్పటికే రూ.36 కోట్లను నిర్వాసితులకు అందించి భూ సేకరణ చేపట్టారు. ఇక ఆలయ మాస్టర్ ప్లాన్ రూపొందించే బాధ్యతలను మరో ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తికి అప్పగించింది. దీంతో ఆలయం, పరిసర ప్రాంతాలను పరిశీలించి ఆయన మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ప్రధాన ఆలయానికి ఎటువంటి మార్పులూ లేకుండా కేవలం పరిసర ప్రాంతాల అభివృద్ధి పనులతోనే నూతన నమూనా తయారుచేశారు. ఆలయ వైదిక కమిటీ, కలెక్టర్, ఇతరుల సలహాలు, సూచనల అనంతరం డిజైన్‌ను ఫైనల్ చేయనున్నారు. కాగా నేల విడిచి సాము చేయకుండా ప్రస్తుత ప్రభుత్వ బడ్జెట్‌కు అనుగుణంగా ఆ ప్లాన్ సిద్ధం చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మాస్టర్ ప్లాన్‌లో 'సాక్షి' సూచనలు

రామాలయ అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ ఆవశ్యకత, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సూచనలు చేస్తూ 'సాక్షి' పలుమార్లు ప్రత్యేక కథనాలు ప్రచురించింది. దాదాపుగా ఆ సూచనలన్నింటినీ కొత్త ప్లాన్‌లో పొందుపరిచారు. వాగ్గేయకారులకు సముచిత స్థానం కల్పించాలని, హనుమాన్ జయంతి, ఇతర ఉత్సవాలలో భక్తులకు, మాలధారులకు భజన మందిరం ఉండాలని కథనాల్లో పేర్కొనగా, పరిగణనలోకి తీసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించేందుకు తూము రామదాసు ఆడిటోరియం, భక్త రామదాసు ప్లాజాను పేర్లతో వేదిక నిర్మించాలని ప్లాన్‌లో పేర్కొన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు భద్రాచలంలో భక్తులకు వసతి కల్పించాలని సూచనలు చేయగా, బూర్గంపాడు మండలంలోని రెడ్డిపాలెంలో రూ. 82 కోట్లతో హోటళ్లు, వసతి నిర్మాణాలను చేపట్టేందుకు ప్రతిపాదనలు చేశారు. దీంతో భక్తులు, స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆధ్యాత్మికత, టూరిజం హబ్‌గా మారుతున్న భద్రాచలంలో రామాయణ థీమ్ పార్కును దేవస్థానం పరిసర ప్రాంతాల్లోనే నిర్మించాలి.
- ఆలయ ఎగువ భాగాన ఉన్న కుసుమ హరినాథ ఆలయం వైపుగా అభివృద్ధి చేస్తే ఆలయ వీక్షణంతో పాటు ఉపాలయాలు అభివృద్ధి అవుతాయి.
- దేవస్థానం నుంచి గోదావరి ఒడ్డు వరకు ఊయల వంతెన నిర్మించాలి. ప్లాన్‌లో వంతెన ఉండాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆర్కిటెక్ట్‌కు సూచించారు.
- కాశీ మాదిరిగా నదీ హారతికి గోదావరి ఒడ్డున శాశ్వత వేదికను నిర్మించాలి. గోదావరి ఒడ్డు నుంచి దేవస్థానం ప్రధాన గోపురం కనపడేలా ఏర్పాట్లు చేయాలి.
- వాగ్గేయకారులకు సముచిత స్థానం కల్పించాలి. హనుమాన్ జయంతి, ఇతర ఉత్సవాల కోసం భజన మందిరం నిర్మించాలి.
- గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించాలి. వీటన్నింటిని మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచారు.
- పార్కింగ్ సమస్యను తీర్చేందుకు పార్కింగ్ కేంద్రం, గోశాల అభివృద్ధి ఇతర పనులను డిజైన్‌లో పొందుపర్చారు.

ప్రశంసాపత్రాల అందజేత

విధి నిర్వహణలో అంకితభావం చూపిన వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు, స్పోర్ట్స్ ప్రతినిధులకు, వివిధ సంఘాల ప్రతినిధులకు 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాప్రతాలు అందించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ వాటిని ప్రదానం చేశారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారి వివరాలిలా.. – సూపర్‌బజార్(కొత్తగూడెం)



అశ్వారావుపేట ఏడీఏ రవికుమార్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ పాటిల్



పుల్లయ్య, కొత్తగూడెం తహసీల్దార్ | ఫయాజుద్దీన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ | పిల్లి రాజేశ్, టైపిస్టు, డీపీఆర్‌ఓ | డి.రాము, ఆఫీస్ సబార్డినేట్ | ప్రతాప్‌పోతన్, ఆఫీస్ సబార్డినేట్ | దయానంద్, హెడ్‌కానిస్టేబుల్ | భాస్కరరావు, ఎల్‌ఎం, జూలూరుపాడు | ఎం.మురళి, కానిస్టేబుల్



టి.తులసీరామ్, ఎంపీఓ | ఆదినారాయణ, ఆర్‌ఐ, జూలూరుపాడు | ఎం.రామకృష్ణ, సీహెచ్‌ఓ | శ్రీరామచంద్ర మూర్తి, అర్చకుడు | ఎ.మహీధర్, కోచ్ | ఎండీ నబీ, రైఫిల్ షూటింగ్ | బి.తిరుమల్‌రావు, ఆర్‌ఐ, డీఎస్‌ఓ ఆఫీస్ | మానస, బాక్సింగ్ | రిత్వికశ్రీ, బ్యాడ్మింటన్ | భద్రు, కొత్తగూడెం కార్పొరేషన్ | పృథ్వీ, వ్యవసాయ మార్కెట్, చర్ల | ఎస్‌కే మునీర్, ఏఎంసీ, ఇల్లెందు

క్రాంతికుమార్, అటవీశాఖ | బి.లాల్‌చంద్, ఏడీఏ, ఇల్లెందు | హబీబ్‌ఉల్లా, డీఏఓ ఆఫీస్ | కె.వేణుకుమార్, డీఏఓ ఆఫీస్ | ఎం.మమత, ఏఈఓ | బి.అరుణ్, ఎంపీఓ, ములకలపల్లి | పి.రాకేశ్, ఎంపీఓ, లక్ష్మీదేవిపల్లి | ఈ.వెంకటేశ్వర్లు, ఎంపీఓ, పినపాక | పి.రాహుల్‌గాంధీ, పీఓజీ, ఆళ్లపల్లి | ఏ.సరిత, ఆర్‌టీఓ ఆఫీస్ | వెంకటపుల్లయ్య, ఎంపీఓ | డి.విజయలక్ష్మి, కానిస్టేబుల్

ఎస్‌కే.అక్రంపాషా, ఆర్‌టీఓ ఆఫీస్ | బి.సైదులు, ఆర్టీసీ కండక్టర్ | బి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి | డా.ముక్కంటేశ్వర రావు, బూర్గంపాడు | డాక్టర్ సాత్విక, భద్రాచలం | డాక్టర్ రవి తేజస్విని, ఇల్లెందు | డాక్టర్ మోహన్ వంశీకృష్ణ, పాల్వంచ | ఇమామ్‌బాబు, ఎస్‌డీహెచ్‌క్యూహెచ్ | జి.దుర్గాభవాని, నర్సింగ్ ఆఫీసర్ | జి.దుర్గాభవానీ, నర్సింగ్ ఆఫీసర్ | ఎం.పద్మ, నర్సింగ్ ఆఫీసర్, బూర్గంపాడు | టి.సుధీర్, ఫార్మసిస్ట్, చర్ల

తారాబాయి, డీఈఓ, అశ్వారావుపేట | యాకూబ్‌పాషా, ఆర్‌ఐ, కలెక్టరేట్ | మంగ, కలెక్టరేట్ | భరత్, కలెక్టరేట్ | నరేశ్, జూనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్ | పద్మ, కలెక్టరేట్ | సైదేశ్వరరావు, ఈడీఎం, కలెక్టరేట్ | పాషా, ఆఫీస్ సబార్డినేట్, కలెక్టరేట్ | దిలీప్, ఐటీ సెక్షన్, కలెక్టరేట్ | పవన్‌కుమార్, అటవీశాఖ | ప్రసాద్‌రావు, ఎఫ్‌ఆర్‌ఓ | నాగేశ్వరరావు, భద్రాచలం డీఎం

అన్ని రంగాల్లో ముందుండాలి..

- త్వరలో 100 మిలియన్ టన్నుల ఉత్పత్తికి ప్రణాళిక
- స్వాతంత్య్ర వేడుకల్లో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్



సింగరేణి ప్రధాన కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు



ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): భారతదేశం అన్ని రంగాల్లో ముందుండేందుకు భారతీయులుగా తమవంతు కృషి చేయాల్సిన అవసరం ఉందని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన 79వ స్వాతంత్య్ర దినోత్సవంలో ఆయన జెండా ఆవిష్కరించి, సింగరేణివ్యాప్త 11 ఏరియాల ఉత్తమ కార్మికులను తోటి డైరెక్టర్లతో కలిసి సన్మానించారు. తొలుత సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు జెండా ఆవిష్కరించారు. సీఎండీ మాట్లాడుతూ.. ఒకనాడు ప్రతీ విషయంలోనూ ఇతర దేశాలపై అధారపడ్డామని, ఇప్పుడు పూర్తిస్థాయిలో స్వావలంబన, స్వయం సమృద్ధి సాధించి, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నిలిచామని చెప్పారు. 136 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ దేశ, రాష్ట్ర అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషిస్తుందన్నారు. త్వరలోనే బొగ్గు ఉత్పత్తి 100 మిలియన్ టన్నులకు పెంచాలని, థర్మల్ విద్యుత్‌ను 3000 మెగావాట్లకు, సోలార్ విద్యుత్‌ను 5000 మెగావాట్లకు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఆధునిక కాలంలో కీలక ఖనిజాల రంగంలోకి సింగరేణి సంస్థ ప్రవేశించాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. గతంలో దక్షిణ భారతదేశంలో కేవలం సింగరేణి సంస్థ మాత్రమే బొగ్గు ఉత్పత్తి చేసేదని, కానీ, ఇప్పుడు అనేక ప్రభుత్వ ప్రైవేట్ కంపెనీలు బొగ్గును ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. ఓపెన్‌కాస్ట్‌లలో టన్నుకు సగటున 8 క్యూబిక్ మీటర్ల ఓబీ తీయాల్సి రావటం, భూగర్భ గనుల్లో కూడా ఉత్పత్తి వ్యయం పెరగటంతో సింగరేణి బొగ్గు ధరను పెంచాల్సి వస్తోందని, కానీ, పోటీ మార్కెట్‌లో నిలబడేందుకు బొగ్గు ధరను తగ్గించాల్సిన అవసరం ఉందని, కార్మికులు, అధికారులు, ఉద్యోగులు ఈ విషయంపై ఆలోచించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. జీఎం పర్సనల్ (వెల్ఫేర్) జీవీ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు, డైరెక్టర్లు సత్యనారాయణరావు, సూర్యనారాయణరావు, వెంకటేశ్వరరావు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నేతలు రాజ్‌కుమార్, త్యాగరాజన్‌తోపాటు లక్ష్మీపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా


అంతర్రాష్ట్ర ముఠా సంచారం..!



పినపాక: అవగాహన కల్పిస్తున్న రేంజ్ ఆఫీసర్ తేజస్విని

కరకగూడెం/పినపాక: రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఉన్న తునికి చెట్లను అక్రమంగా నరికి ఇతర రాష్ట్రాలకు తరలించే అంతర్రాష్ట్ర ముఠా పినపాక, కరకగూడెం, మణుగూరు మండలాల్లో సంచరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచా రం అందిందని ఏడూళ్ల బయ్యారం రేంజర్ తేజస్విని తెలిపారు. శుక్రవారం పలు గ్రా మాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. తునికి చెట్లు అటవీ సంపదలో భాగమని, వీటిని నరికితే పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. అంతరాష్ట్ర దొంగలు కొందరు కరకగూడెం, మణుగూరు, పినపాక మండలాల్లో పాగా వేసి చెట్లను నరికేందుకు సిద్ధమయ్యారని, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండి గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే ఫారెస్ట్ అధికారులకు తెలపాలని ఆమె సూచించారు.

విద్యార్థులకు అటెండర్ చేయూత



జ్యోతికిరణ్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు

అశ్వాపురం: మండలంలోని నెల్లిపాక బంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న దూరప్రాంత విద్యార్థుల రవాణా ఖర్చులకు పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న జ్యోతికిరణ్ తన జీతం నుంచి ప్రతి నెల రూ.6 వేలు ఇస్తానని శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవంలో ప్రకటించారు. దూరప్రాంతాల నుంచి పాఠశాలకు వస్తున్న విద్యార్థులకు రెండేళ్లుగా గ్రామస్తులు తలా కొంత డబ్బు సాయం చేస్తున్నారు. ఈ ఏడాది దాతలు ముందుకు రాకపోవడంతో అటెండర్ జ్యోతికిరణ్ విద్యార్థులకు సహాయం చేయడానికి ముందుకు రాగా.. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. జ్యోతికిరణ్‌ను పాఠశాల హెచ్‌ఎం శంకర్ ఆధ్వర్యంలో సన్మానించారు. కాగా, హిందీ ఉపాధ్యాయుడు రాంబాబు ఒక నెలకు విద్యార్థుల రవాణా ఖర్చుకు రూ.10 వేలు, నెల్లిపాక పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ అక్కిన అచ్చుతరామారావు రూ.10 వేలు అందించారు.

సూర్యతండాలో చిన్నారులకు అస్వస్థత

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని సూర్యతండాలో పది రోజులుగా పలువురు చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారు. ఉన్నట్టుండి వరుసగా వాంతులు, విరోచనాల బారిన పడుతుండడంతో తల్లిదండ్రులు చికిత్స చేయిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నాచెల్లెలు జాటోత్ జయంత్, పవన్‌శ్రీ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు. కాగా, గ్రామంలో పలువురు చిన్నారులు అస్వస్థతకు గురవడానికి తాగునీరు కలుషితమా లేక వాతావరణ మార్పులు కారణమా అన్నది తెలియడం లేదు. వైద్యాధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అవసరం తీరాక అంతే..

- నాడు ఆశ్రయం కల్పించి.. పనిచేయించారు..
- నేడు లీజ్ భూముల పేరుతో ఖాళీకి ప్రణాళిక
- కార్మిక కుటుంబాలపై సింగరేణి శీతకన్ను



21 పిట్ ఏరియా వ్యూ

ఇల్లెందురూరల్: బొగ్గు గనుల్లో పనులు చేసేందుకు ఆవిర్భావ సమయంలో స్థానిక కూలీలు ముందుకు రాలేదు. నాటి అధికారులు సుదూర ప్రాంతాల నుంచి కార్మికులను రప్పించి ఆశ్రయం కల్పించి పూసపల్లి భూగర్భగనిలో పనులు చేయించారు. నాడు వలస కార్మికుల సమూహంతో గూడుకట్టుకున్న ఆవాసం నేడు 21పిట్ ఏరియాగా ఉంది. ఆవిర్భావం నాటి కార్మికుల వారసులే ప్రస్తుతం ఇక్కడ జీవనం సాగిస్తున్నారు. కానీ, 138 ఏళ్ల తర్వాత ఓసీ విస్తరణ పనుల పేరుతో నిర్వాసితులను ఇక్కడి నుంచి ఖాళీ చేయించేందుకు సింగరేణి అధికారులు సిద్ధమవుతుండడం వారిలో ఆందోళన కలిగిస్తోంది.

అంకితభావంతో పనులు

బొగ్గు తవ్వకాలు జరుగుతున్న సమయంలో ఇతర ప్రాంతాల నుంచి కార్మికులను రప్పించి పనిలో వినియోగించారు. ఆ రోజుల్లో బొగ్గు తవ్వే పని చాలా ప్రమాదకరంగా ఉండేది. కార్మికుడు బావిలో పనికి వెళ్తే తిరిగి వచ్చే వరకు ఆ కుటుంబం బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి ఉండేది. తగినంత గాలి, వెలుతురు లేకపోవడంతో కూడా వారి ఆరోగ్యానికి హాని కలిగేది. రోజుకు 10 – 12 గంటలు పని చేసినా వారికి దినసరి కూలీ చెల్లించేవారు. అయినా వారు కష్టపడి పనిచేశారు.

గని సమీపంలోనే గుడిసెలు

బొగ్గు గనుల ఆవిర్భావ సమయంలో నాటి అధికారుల ఆదేశం మేరకు కార్మికులు గనికి సమీపంలోనే గుడిసెలు వేసుకొని నివసించేవారు. గుడిసె నిర్మాణం కోసం సంస్థ అధికారులే సామగ్రి సమకూర్చేవారు. చుట్టూ దట్టమైన అడవి ఉండటంతో క్రూరమృగాల భయంతో పని ముగిసిన తరువాత కార్మికులు సమూహంగా ఏర్పడి దివిటీ వెలుగులో గూటికి చేరుకునేవారు. సింగరేణి నామకరణంతో పబ్లిక్ లిమిటెడ్ సంస్థగా గుర్తింపు పొందిన తరువాత కార్మికుల నివాసాలకు సమీపంలోనే అధికారుల నివాసం కోసం రేకులతో క్వార్టర్లను నిర్మించారు. అప్పటి నుంచి 21పిట్ ఏరియాగా పిలుస్తుంటారు.

స్పష్టమైన హామీలతో చకచకా..

వందేళ్లకు పైగా బొగ్గు తవ్వకాలు చేపట్టిన ఇల్లెందు ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు అడుగంటడంతో ప్రస్తుతం జేకేఓసీ విస్తరణ పేరుతో సింగరేణి యాజమాన్యం బొగ్గు వెలికితీతకు సన్నద్ధమైంది. దీని కోసం అన్ని అనుమతులు పొందే సమయంలోనే ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో సభ నిర్వహించింది. నిర్వాసితులయ్యే వారికి మెరుగైన ప్యాకేజీ ఇస్తామని, ప్రజలందరికీ న్యాయం చేస్తామని యాజమాన్యం ప్రకటించింది. నిర్వాసితుల గుర్తింపులోనూ అలాగే ప్రకటనలు గుప్పించి, ముందుకెళ్లారు.

బూడిద చేతిలో పెట్టి..

21పిట్ ప్రాంతం మొత్తం సింగరేణి లీజు పరిధిలో ఉందని, ఇక్కడ నివసిస్తున్న వారికి పరిహారం ఇవ్వడం కుదరదని, ఇల్లు కట్టుకునేందుకు 90 గజాలు స్థలం మాత్రమే ఇస్తామని సింగరేణి అధికారులు స్పష్టం చేస్తున్నారు. పరిహారం మాటెత్తొద్దని హుకుం జారీ చేస్తున్నారు. కానీ, బ్రిటీష్ హయాంలో 21పిట్ ఏరియాకు వలసవచ్చిన కార్మికులు అంకితభావంతో పనులు చేసి సంస్థను నిలబెట్టారు. మానవతా దృక్పథంతో సాయం చేయాల్సిన అధికారులు చట్టాలను చూపించడం ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కాగా, ఓ అధికారి.. 'మీరు నివసిస్తున్న ఇంటి స్థలం ఎవరిదో మీ అయ్యలు మీకు చెప్పలేదా' అంటూ వ్యంగ్యంగా మాట్లాడటం ఆగ్రహానికి కారణమవుతోంది.

వందేళ్ల సేవకు ఇదేనా గుర్తింపు?



మా నాన్న ఇబ్రహీం బేగ్ వందేళ్ల కిందట సింగరేణిలో పని చేశాడు. నాటి నుంచి మా కుటుంబం ఇక్కడే ఉంటోంది. నేడు ఇంటి స్థలం ఇస్తాం.. ఖాళీ చేయండి అంటున్నారు. ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు. వందేళ్ల సేవను పరిగణనలోకి తీసుకోకపోవడం సరికాదు.

–ఎండీ బేగ్, 21పిట్ ఏరియా

వారసులను విస్మరించొద్దు



సింగరేణి సంస్థకు పురుడు పోసిన కార్మికుల శ్రమను సంస్థ గౌరవించాలి. వారి వారసులకు అందించే సహకారాన్ని, ఇచ్చే పరిహారాన్ని మానవీయ కోణంలో చూడాలి. నాడు అవసరం కోసం ఇంటి నిర్మాణానికి సహకరించి ఇప్పుడు ఖాళీ చేయమనడం అన్యాయం.

–దండు బాలయ్య, మాజీ కార్మికుడు

450 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన



జూలూరుపాడులో భారీ జాతీయ జెండా ప్రదర్శన

జూలూరుపాడు: స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం జూలూరుపాడులో 450 మీటర్ల భారీ జాతీయ జెండాను ప్రదర్శించారు. ఆరోగ్య జీవనయాత్ర–వాకర్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. పోలీస్ స్టేషన్ నుంచి శ్రీ సాయిబాబా ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, జీవన యాత్ర సభ్యులు వేల్పుల బోసు, బావట్ల వెంకటేశ్వర్లు, సాయిన్ని సత్యనారాయణ, తాళ్లూరి నవీన్, కిరణ్ చౌదరి, రామకృష్ణ, ఉసికల భాస్కర్, వందనపు కమలాకర్, ఉల్లి పూర్ణచందర్‌రావు, కోటేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఉట్ల సందడికి వేళాయె..

నేటి శ్రీకృష్ణాష్టమి పండుగకు సన్నద్ధం



ఉట్టి కొడుతున్న యువకులు(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలు ఎంతో ఉల్లాసంగా జరుపుకునే ఉట్ల పండుగ రానే వచ్చింది. శ్రావణ మాసం కృష్ణపక్ష అష్టమి రోజున శ్రీకృష్ణుడు జన్మించాడని పురణాలు చెబుతుండగా, ఏటా శ్రీకృష్ణ జన్మాష్టమిని జరుపుకుంటారు. భక్తులు శనివారం పండగను జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. బాలకృష్ణుడిని పూజిస్తే సకల శుభాలతోపాటు సంతాన ప్రాప్తి కలుగుతుందని పలువురు విశ్వసిస్తారు. ఇందుకు పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రం శ్రీకృష్ణున్ని పూజిస్తారు. శ్రావణ మాసంలో లభించే పళ్లు, అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడ స్వామికి నైవేద్యంగా పెడతారు. ఊయలలో శ్రీకృష్ణ విగ్రహాన్ని పడుకోబెట్టి ఊపుతూ రకరకాల పాటలు, కీర్తనలు పాడుతూ స్మరిస్తారు. వీధుల్లో, కూడళ్లలో ఉట్లు కట్టి పోటీపడి వాటిని కొడతారు. శ్రీకృష్ణుడి జన్మాష్టమి వేడుకలను ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరిస్తారు. ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తారు. కాగా, పిల్లలను కృష్ణుని, గోపికల రూపాలలో అలంకరించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తుండడంతో మార్కెట్లలో ఆయా డ్రస్సులు, పిల్లన గ్రోవులు, నెమలి పింఛాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

నాగులవంచ రైల్వేస్టేషన్ కొనసాగింపు

చింతకాని: మండలంలోని నాగులవంచ రైల్వేస్టేషన్‌ను యథావిధిగా కొనసాగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. ప్రయాణికుల నుంచి ఆదరణ లేదంటూ ఇటీవల స్టేషన్‌ను మూసివేయనున్నట్లు ప్రకటించారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు స్టేషన్‌ను కొనసాగించాలంటూ నిరసనలు తెలిపారు. దీంతో రైల్వే అధికారులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని స్టేషన్‌ను యథావిధిగా కొనసాగించనున్నట్లు ప్రకటించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కోర్టులో జెండా ఆవిష్కరణ



జెండా వందనం చేస్తున్న జడ్జి, న్యాయవాదులు



నృత్యం చేస్తున్న పాఠశాల విద్యార్థులు

కొత్తగూడెంటౌన్/సింగరేణి(కొత్తగూడెం): జిల్లా కోర్టు, ఎస్పీ కార్యాలయాల్లో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఎస్పీ రోహిత్‌రాజు జెండా ఆవిష్కరించగా.. కోర్టులో జడ్జిలు, న్యాయవాదులు జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. దేశభక్తి పాటలకు వారు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



ప్రకాశం స్టేడియంలో విద్యార్థుల ప్రదర్శన

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగుండాల గ్రామంలో బైక్ పైనుంచి జారిపడి వట్టం నిర్మల (58) శుక్రవారం మృతి చెందింది. జూలూరుపాడు మండలం పాపకొల్లు జీపీ బచ్చలకోయగూడెం గ్రామానికి చెందిన నిర్మల అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తె ఎర్రిపోతుల కృష్ణవేణిని పరామర్శించేందుకు రెండు రోజుల కిందట మామిడిగుండాలకు వచ్చింది. శుక్రవారం ఉదయం చేను వద్దకు బయలు దేరిన నిర్మల సమీప బంధువు ఎట్టి నాగేశ్వరరావు బైక్‌పై అదేమార్గంలో వెళ్తుండటంతో బైక్ ఎక్కింది. కొద్దిదూరం వెళ్లగానే బైక్ అదుపుతప్పడంతో నిర్మల జారి పడగా.. ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమార్తె కృష్ణవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

యువతి ఆత్మహత్య

గుండాల: పలు కారణాలతో నిశ్చితార్థం ఆగిపోవడంతో ఓ యువతి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సైదారవూఫ్ కథనం ప్రకారం.. మండలంలోని చీమలగూడెం గ్రామానికి చెందిన ఆరెం గౌతమి (22)కి అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో ఆరు నెలల కిందట పెళ్లిసంబంధం కుదిరింది. పలు కారణాలతో నిశ్చితార్థం ఆగిపోయింది. తీవ్ర మనస్తాపం చెందిన గౌతమి శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగింది. కుటుంబ సభ్యులు గుండాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సకాలంలో వైద్యం అందలేదని ఆరోపణ

పురుగులమందు తాగిన యువతిని ఆస్పత్రికి తీసుకురాగా ఇద్దరు వైద్యాధికారులు లేరని, సకాలంలో వైద్యం అందకపోవడంతోనే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన వైద్యులు జెండా ఆవిష్కరించి వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే యువతిని ఆస్పత్రికి తీసుకురాగా.. స్టాఫ్‌నర్సు పరీక్షిస్తుండగానే మృత్యువాత పడింది.

కుక్క దాడిలో గాయాలు

ముదిగొండ: ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న బాలుడిపై కుక్క దాడి చేయగా గాయాలయ్యాయి. ముదిగొండ బీసీ కాలనీకి చెందిన ఐదేళ్ల బాలుడు విద్యాసాగర్ శుక్రవారం రాత్రి తమ ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నాడు. బయటి నుంచి వచ్చిన వీధి కుక్క బాలుడిపై దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి.

ప్రవేశాలకు సెప్టెంబర్ 10వరకు గడువు

ఖమ్మం సహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ పరిధి సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(గతంలో ఎస్‌డీఎల్‌సీఈ)లో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులో ప్రవేశానికి సెప్టెంబర్ 10వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఈ విషయాన్ని ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి తెలిపారు. ప్రవేశాలకు ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఫీజు, అర్హతలు వివరాల కోసం అధ్యయన కేంద్రం సెల్ నంబర్ 80088 11998 లేదా కేయూ దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.